

అద్దం ముందు నిలబడి చేతిలో ఉన్న పౌడర్‌ని తెల్లగా కనిపించకుండా అద్దుకుంటున్న రమణారావుగార్కి "ఈ రోజు ఆలస్యం అవుతుందా?" అనడగటం వినిపించింది.

తెల్లటి మల్లెల్లా ఉన్న బట్టల్నీ, తనని తానూ చూసుకొని తృప్తి చెందాక

వెనక్కి తిరిగి వాలుగడుగులు వేసి చెప్పాడు

అవును. రాజారావుగారొస్తున్నారు. మేం ఓ విషయం మీద చర్చించాల్సి ఉంది. ఎప్పటికి అవుతుందో తెలియదు. నా కోసం ఎదురు చూడకు"

రమణారావు బయటకు అడుగుపెట్టి ఓ క్షణం తన్మయత్వం చెందేరు.

సాయంకాలం. ఆకాశం నిర్మలంగా ఉంది. వాతావరణం ప్రశాంతంగా ఉంది.

అందులోనూ ఊరికి దూరంగా ఉందా ప్రదేశం.

దూరంగా తెల్లటి మేఘంలా కదిలొస్తున్న రాజారావు కనిపించేరు.

ఇరువురి కళ్ళూ కలుసుకున్నాయి

# నీతి కథ

పి. చంద్రశేఖర అజాద్

"ఏకాంత స్థలాన్వేషణ జరగాలిగా"

"అలా ఏట్లోకి నడుద్దాం"

ఏభై సంవత్సరాల వయసు వారినింకా స్పృశించిందా అంటే అనుమానమే వారు ఏటిగట్టునుండి దిగి తమకంటూ ఓ స్థలం నిర్ణయించుకోవటానికి చాలా కష్టపడ్డారు.

'ఎక్కడో చోట కూర్చుందామంటే తెల్లటి బట్టలు మురికి అవుతాయి.

ఇంట్లో గుంజలేక చస్తున్నానంటూ ఒకటే గొడవ.' రమణారావు గారన్నారు.

"ఇసుకలో కూర్చుంటే మట్టి అంతగా అంటదు. అయినా ఏట్లో ఇసుక ఉండనిస్తేగా" అన్నారు రాజారావు.

ఆయనకు కొద్ది దూరంలో 'బురద' గుంట ఉంది. అక్కడక్కడా ఇసుక గుట్టలూ, కొంత బురదా కనిపిస్తున్నాయి.

"మనం తీరిగ్గా మాట్లాడుకుని చాలా రోజులయింది" అనుకున్నారు

కొద్దిసేపటి తర్వాత -

మాటలూ ఏటినీటి ప్రవాహంలా మెల్లగా ఆరంభం అయ్యాయి.

మరికొద్దిసేపు నీటి గలగలల్తో పాటు నవ్వుల మిలమిలలు కూడా

"అది కాదు" అన్నాడు. రమణారావు

"నన్ను చెప్పనీయండ్డి" రాజారావుగారు

మరి కొద్ది నిమిషాలు మాటలే

ఆ తర్వాత ఒకరే మాట్లాడే ప్రయత్నం విజయవంతం కాలేదు.

ఇరువురి పెదవుల మీదా నవ్వు చెదిరింది

మాటలు చిన్న కేకలుగా రూపాంతరం చెందాయి

"నేను చాలా సీరియస్‌గా ఖండిస్తున్నా"

"నేనూ"

"నో..... నేను అంగీకరించను."

"మీ అంగీకారం ఎవరికి కావాలండ. దాని భావం అది"

"ఏమిటండి బోడిభావం. అదసలు భావమా? ఛీ..... ఛీ...."

"అలా అనకండి అది విమర్శకాదు"

"మరెలా అనాలి. నాకు తెలియక అడుగుతా. మీది విమర్శా!"

"మరేమిటంటారు?"

"అదిగో కనిపిస్తుందే. అది"

"ఏవిటీ - రొచ్చుగుంటా?"

"అంతే సరిగ్గా అదే"

"ఇంత నీచమైన విమర్శా?"

కేకలు మాయం అయిపోయాయి

అరుపులు ఆవిర్భవించాయి.

అవి కూడా కొద్ది క్షణాలే.

"మీరు బురద పూయాలనుకుంటున్నారు. కానీ గుర్తుంచుకోండి. అది మాకూ చేతనవును."

ఓ 'రావు' గారు సీరియస్‌గా వెళ్ళి ఓ చేత్తో బురదనందుకుని

"ఇప్పుడు చెప్పండి" అన్నారు.

"ఏవిటీ బురద పూద్దామనే"

"పూయను. విసురుతా"

నిజంగానే విసిరేరు

అటు పిమ్మట మరో రావుగారు పూనకం వచ్చిన వారిలా మరో గుంట దగ్గరకు పరిగెత్తుకెళ్ళి రెండుచేతుల్లోనూ బురదనింపుకొని

"నేను పూస్తానంతే" అన్నారు

అటు పిమ్మట

అక్కడ "అన్ పార్లమెంటరీ" లాంగ్వేజ్ రాజ్యం చేసింది

అప్పుడప్పుడూ అందులో కవిత్వమున్నూ వినిపించింది.

చిక్కటి చీకటి.....

ఓపిక అయిపోయాక...... ఒకరి వెనక ఒకరు ఇంటి మార్గం పట్టారు.

ఇప్పుడు వారి వస్త్రములు కూడా చిరిగి ఉన్నవి!

## నీతి

వారిరువురూ 'తెలుగువారే' అనుటలో ఎటువంటి సందేహం అవసరం లేదు.

అంతేకాదు వారు --- కూడా అయి ఉందురు.

చర్చలో ఏమీ లేనందున బూతులూ - బురదా మిగిలినవి

ఈ విధమైన చర్చలు ప్రారంభించువారు శ్వేత వస్త్రములకూ (ముదురు రంగులకి కూడా) కేశములకూ అనర్థులు.

రాళ్ళ గుట్టల దగ్గరా, బురద గుంటల దగ్గరా చర్చించుటను ఎవరికి వారు నిషేధించుకోవలెను.

## హెచ్చరిక

ఈ కథకు చెందిన సంపూర్ణ హక్కులు మాకు చెంది ఉన్నవి. ఏ సబ్బుల కంపెనీ వారయినా ( డిటర్జెంట్ కేకూ, పౌడర్, లిక్విడ్) ఏ రూపంలో ఇందులోని సన్నివేశాలను ఉపయోగించుకున్నా మేం తీసుకునే సివిల్, క్రిమినల్ చర్యకు గురి కాగలరని హెచ్చరిస్తున్నాం.